# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద సమస్యను ఎదుర్కోవడానికి చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు.
- ❖ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్లపై తీర్పును ఏసీబీ కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.
- ❖ పాలసీ రెపో రేటును 6.50 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఈరోజు ప్రకటించారు.
- ❖ తొమ్మిదవ పి-20 పార్లమెంటరీ స్పీకర్స్ సదస్సు ఈ నెల 13, 14వ తేదీల్లో జరగనుందని లోకసభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో కారణంగా రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

==========================

రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ రోజు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రం గడిచిన నాలుగు దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాద సమస్యపై పోరాడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వ్యూహాల వల్ల ఈ సంఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. దీని కోసం నాలుగు రాష్ట్రాల అధికారులతో కూడిన జాయింట్ టాస్క్ ఫోర్స్‌లు ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందని, సమిష్టిగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

==========================

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్, సీఐడీ కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో ఈరోజు వాదనలు ముగిశాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు ముగిసిన అనంతరం వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై నిన్న చంద్రబాబు తరఫు న్యాయవాదుల వాదనలు పూర్తి కాగా, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మరికొన్ని వాదనలు వినిపిస్తానని కోర్టును కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాలసీ రెపో రేటును 6.50 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఈరోజు ప్రకటించారు. ద్రవ్య విధాన కమిటీ - 2023 ఈ నెల 4, 5, 6వ తేదీల్లో సమావేశమైంది. ఆర్‌బీఐ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, అభివృద్ధి చెందుతున్న స్థూల ఆర్థిక, ఆర్థిక పరిణామాలు, దృక్పథం వివరణాత్మక అంచనా తర్వాత, పాలసీ రెపోను కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. వరుసగా నాల్గవసారి రేటు మారలేదు. దీని పర్యవసానంగా స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 6.25 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు, బ్యాంక్ రేటు 6.75 శాతం వృద్ధికి మద్దతునిస్తూ, ద్రవ్యోల్బణం క్రమంగా లక్ష్యానికి అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి వసతి ఉపసంహరణపై దృష్టి పెట్టాలని 6 మంది సభ్యుల కమిటీ నిర్ణయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తొమ్మిదవ పి-20 పార్లమెంటరీ స్పీకర్స్ సదస్సు ఈ నెల 13, 14వ తేదీల్లో జరగనుంది. జీ-20లో, పార్లమెంట్ 20, G-20 దేశాల స్పీకర్ల నేతృత్వంలోని ఎంగేజ్‌మెంట్ గ్రూప్. ఇది గ్లోబల్ గవర్నెన్స్‌కు పార్లమెంటరీ కోణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. పి-20 ప్రధాన ఇతివృత్తం పార్లమెంట్ ఫర్ వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్. ఈ సదస్సు గురించి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈరోజు ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ, 25 మంది స్పీకర్లు, 10 మంది డిప్యూటీ స్పీకర్లు, 50 మంది పార్లమెంటు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పాన్ ఆఫ్రికన్ పార్లమెంట్ అధ్యక్షుడు భారతదేశంలో మొదటిసారిగా జీ-20లో పాల్గొంటారని తెలిపారు. సమ్మిట్ కోసం నాలుగు సెషన్లు ఉండే విధంగా రూపొందించినట్లు తెలియజేశారు. వాతావరణ మార్పులతో పాటు ఆరోగ్యం, విద్య, వ్యవసాయంపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో కారణంగా వాయవ్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనసభ్యులు డాక్టర్ పి.వి.సిద్ధారెడ్డి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం మేకలచెరువు గ్రామ సచివాలయంలో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. తిరుపతిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చిన్నపిల్లలకు, గర్భిణీ స్త్రీ సమస్యలు, జనరల్ మెడిసిన్, కంటి వైద్యం అందిస్తున్నామని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ బి. ఆర్.శిరీష అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మౌలిక సదుపాయల కల్పన శరవేగంగా సాగుతోంది. దేశవ్యాప్తంగా హైవే, రైల్వే, విమాన, ఇంటర్నెట్, సమాచార, జలమార్గం అన్నింటా ప్రగతి వైపు అడుగులు వేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గడిచిన 9 ఏళ్ళల్లో తీర ప్రాంతాలతో సహా గిరిజన, పర్వత ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారు. పర్వతమాల, భారతమాల వంటి పథకాలతో సాధికారత కల్పించింది. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, మాతృ భాషలో విద్యా బోధన ద్వారా అందరికీ విద్య, సౌలభ్యంకు ప్రాధాన్యతను ఇచ్చామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ...

.

(వాయిస్ 39 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఈనెల 9 నుండి 15వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటించనున్నారు. అక్టోబర్ 9 ఉదయం 8 గంటల 55 నిమిషాలకు హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి పోర్ట్ ట్రస్ట్ గెస్ట్ హౌస్ లో బస చేస్తారు. అక్టోబర్ 11న జరిగే "గురువుకి వందనం" కార్యక్రమంలో పాల్గొంటారు. అక్టోబర్ 12 తేదీన విశాఖ నుంచి రైల్లో ఏలూరు తిరుగు ప్రయాణమవుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి డి.హరిత అధికారులను ఆదేశించారు. ఈ పనుల పురోగతిపై అధికారులతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అధికారులు సమన్వయం చేసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎస్సై తుది రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈ రోజు నుంచి 12వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ పోలీసు నియామక మండలి ఛైర్మన్ అతుల్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు నగరాల్లోని కేంద్రాల్లో ఈ రాతపరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే 94414 50639, 91002 03323 నంబర్లలో సంప్రదించొచ్చని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎనిమిది వేల కోట్ల రూపాయలను విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి. శ్రీహరి అన్నారు. ఈ రోజు తిరుపతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అభివృద్ధికీ నిధులను విడుదల చేస్తోందనీ, ఆంధ్రప్రదేశ్ కూ అవసరమైన నిధులను కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ ల ఖాతాల్లోకి ఈ నిధులను జమ చేయకపోతే, పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లా కోర్టును ఫూల్ బాగ్ లోని ఎం.ఆర్.పి.జి.బాయ్స్ హాస్టల్ భవనంలోనికి మార్పు చేసినట్లు జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టుతో పాటు అన్ని కోర్టులు ఫూల్ బాగ్ లో నున్న 3 అంతస్తుల భవనంలోనే కార్యకలాపాలు జరుపుతున్నాయని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నార్గెస్ మొహమ్మదికు నార్వే నోబెల్ కమిటీ ప్రకటించింది. ఇరాన్‌లో మహిళల అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికిగానూ.. ఈ అవార్డు అందజేస్తున్నట్లు కమిటీ వెల్లడించింది. నోబెల్ శాంతి పురస్కారం పొందిన 19వ మహిళగా నార్గెస్ మొహమ్మదిని నిలిచారు. దాంతో పాటు ఈ అవార్డు అందుకున్న రెండో ఇరాన్ మహిళగా ఆమె నిలిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాల్య వివాహాలను అరికట్టడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిరోదంపై ఈరోజు జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించడానికి విస్తృత ప్రచారం అవసరమని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =